నేత్రపర్వంగా మీనాక్షీసుందరేశ్వరుల
రథోత్సవం


నంది వాహనంపై మీనాక్షీ సుందరేశ్వరుడు

ప్యారీస్, డిసెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధి చెందిన మదురై మీనాక్షి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలను కోలాహలంగా నిర్వహిస్తున్నారు. సోమవారం అష్టమి సందర్భంగా మీనాక్షి సమేత సుందరేశ్వరర్ దంపతులను ప్రత్యేక రథంలో కొలువుదీర్చారు. వేదమంత్రోచ్చారణ మధ్య ఆలయ ప్రధాన ద్వారం నుంచి రథం కదిలింది. ఈ సందర్భంగా తెల్లవారు జామున 5 గంటలకే ఆలయాన్ని తెరచి దైవదంపతులకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ నిర్వహించారు. శైవక్షేత్రం మైన ఈ ఆలయంలో ప్రతీ ఏటా ధనుర్మాసంలో వచ్చే అష్టమి రోజున ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది అంగరంగ వైభవంగా చేపట్టిన రథోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి దర్శనం చేసుకున్నారు. రద్దీలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు నిఘా ముమ్మరం చేశారు. భక్తుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వ రవాణా సంస్థలు పలు ప్రాంతాల నుంచి మదురైకి ప్రత్యేక బస్సులు నడిపాయి.


ప్రత్యేక అలంకరణలో మీనాక్షి అమ్మవారు


రథోత్సవానికి హాజరైన అశేష భక్తజనం

రైతుల సంక్షేమమే
మంత్రి ఏవీ.వేలు
ప్రభుత్వ లక్ష్యం

ప్యారీస్, డిసెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రభుత్వం అభివృద్ధి పథకాలను అమలు చేస్తోందని ప్రజా పనుల శాఖా మంత్రి ఏవీ.వేలు అన్నారు. రాష్ట్రంలో రైతు బజార్లు ప్రారంభించి 25ఏళ్లు పూర్తైన సందర్భంగా సేలం సూరమంగళంలోని రైతు బజారులో సోమవారం సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి శాఖామంత్రి రాజేంద్రన్‌తో కలిసి మంత్రి ఏవీ.వేలు ఈ వేడుకలు ప్రారంభించి ఆ రైతు బజార్‌లో కూరగాయల నాణ్యత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అన్నదాతల ఆర్థిక వ్యవస్థ మెరుగు పరచాలన్న ఆశయంతో 1999వ సంవత్సరం అప్పటి ముఖ్యమంత్రి కరుణానిధి రాష్ట్ర వ్యాప్తంగా 100 రైతు బజార్లను ప్రారంభించినట్లు తెలిపారు. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా తాము పండించిన కూరగాయలను రైతు బజార్లలో అన్నదాతలే విక్రయించి లాభం పొందుతున్నారని అన్నారు. సేలం జిల్లాలో మాజీ మంత్రి వీరపాండ్య ఆర్ముగం కృషితో ఏర్పాటైన తొమ్మిది రైతు బజార్లు విజయవంతంగా పనిచేస్తున్నాయన్నారు. నాణ్యమైన, తాజా కూరగాయలు, పండ్లు, ఆకు కూరలు అందుబాటులో ఉండటం వల్ల రైతు బజార్లకు ప్రజాదరణ పెరిగిందని తెలిపారు. ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా రైతు బజార్ల అభివృద్ధి నిమిత్తం రూ.27.50 కోట్ల నిధులు కేటాయించారని తెలిపారు. అదేవిధంగా వ్యవసాయానికి ప్రత్యేక ఆర్థిక బడ్జెట్‌ను కూడా అసెంబ్లీలో ప్రవేశ పెట్టి అవసరమైనంత నిధులు కూడా కేటాయించారని వివరించారు. అంతేకాక నీటి వనరులను సంరక్షించే బాధ్యతలను సీనియర్ మంత్రి దురై మురుగన్‌కు కేటాయించారని, రైతుల సంక్షేమం కోసం ఇన్ని మంచి పథకాలు ప్రవేశపెడుతున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని రాజకీయ కోణంలో ప్రతిపక్ష పార్టీలు విమర్శిస్తున్నాయని మంత్రి ఏవీ.వేలు తెలిపారు.


రైతు బజార్‌లో రైతులతో మాట్లాడుతున్న మంత్రి ఏవీ.వేలు


ఉద్యోగ నియామకాలు అందుకున్న క్రీడాకారులతో ముఖ్యమంత్రి స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

జాతీయ పోటీల్లో పతకాలు...
క్రీడాకారులకు ఉద్యోగాలు
● నియామక ఉత్తర్వులందించిన సీఎం స్టాలిన్

చెన్నై, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు 3 శాతం రిజర్వేషన్‌లో భాగంగా 84 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు లభించాయి. రాష్ట్ర క్రీడాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చెన్నై సచివాలయంలో సోమవారం ఉదయం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యమంత్రి స్టాలిన్ ఆ క్రీడాకారులకు ఉద్యోగ నియామక ఉత్తర్వులను అందజేశారు. 204-25 ఆర్థిక సంవత్సరంలో 3 శాతం రిజర్వేషన్ల ప్రకారం అంతర్జాతీయ, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన వంద మంది క్రీడాకారులకు ప్రభుత్వ శాఖలు లేదా ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో క్రీడాభివృద్ధి శాఖ కూడా నిర్వర్తిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి ప్రకటించారు. ఆ మేరకు తొలివిడతగా అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో పతకాలు పండించిన రాష్ట్ర క్రీడాకారులు 84 మందికి వారి విద్యార్హతలను బట్టి 14 ప్రభుత్వ శాఖల్లో నియమిస్తూ, వారందరికి నియామక ఉత్తర్వులను స్టాలిన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు పెరియసామి, కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, తంగం తెన్నరసు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం తదితరులు పాల్గొన్నారు.

స్థలసేకరణ నుంచి మినహాయింపు...

సచివాలయంలో జరిగిన మరొక కార్యక్రమంలో కార్పొరేషన్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ చేపట్టదలచిని స్థలసేకరణ ఉపసంహరించుకుంది. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిలో ఉన్న కొరట్టూరు, కొట్టివాక్కం విరుగంబాక్కం, నెసపాక్కం, పోరూరు, నెర్కుండ్రం, ముగప్పేర్, అంబత్తూరు, నోలంబూరు తదితర ప్రాంతాల్లో సుమారు 499 ఎకరాల పట్టా భూముల్లో ఇళ్లు నిర్మించుకుని వేలాదిమంది నివసిస్తున్నారు. ఈ స్థలాలను రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ వివిధ ప్రాజెక్టులు అమలు చేయడానికి ఇళ్ళ యజమానులకు మార్కెట్ రేట్ ప్రకారం నగదు చెల్లించి స్థలాలను సేకరించాలని నిర్ణయించింది. అదే సమయంలో ఈ భూముల్లోనివసిస్తున్న ఇళ్ళ యజమానులు స్థల సేకరణను విరమించుకోవాలని కొన్నేళ్లుగా కోరుతున్నారు. వారి అభ్యర్థనను ప్రభుత్వం ఆమోదించి రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ నిర్దేశిత ప్రాంతాల్లో స్థలసేకరణ కోసం ఇచ్చిన నోటిఫికేషన్లను ఉపసంహరించుకుంది. ఈ నేపథ్యంలో సచివాలయంలో రాష్ట్ర గృహనిర్మాణ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో స్థలసేకరణ మినహాయింపు ఉత్తర్వులను పదిమందికి స్టాలిన్ అందజేశారు.

22 జిల్లాల్లో 400 తరగతి గదులు
ప్రారంభించిన సీఎం స్టాలిన్

రాష్ట్ర పాఠశాలల విద్యాశాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సచివాలయంలో జరిగిన వేర్వేరు కార్యక్రమాల్లో 22 జిల్లాల్లో నిర్మించిన 400 పాఠశాల తరగతి గదులు, గ్రామపంచాయతీలకు 95 వాహనాలను ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. కోయంబత్తూరు, ధర్మపురి, దిండుగల్, కాంచీపురం, కృష్ణగిరి, పుదుకోట, రామనాథపురం, రాణిపేట, సేలం, శివగంగ, తంజావూరు, నీలగిరి, తూత్తుకుడి, తిరునల్వేలి, తిరుపత్తూరు, తిరువళ్లూరు, తిరువణ్ణామలై, వేలూరు, విల్లుపురం విరుదునగర్ జిల్లాల్లోని 171 పాఠశాలల్లో రూ.56.11 కోట్లతో నిర్మించిన 350 కొత్త తరగతి గదులు, అదనపు తరగతిగదులను ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఇదే విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సదుపాయల కల్పనలో భాగంగా ధర్మపురి, దిండుగల్, కాంచీపురం, రామనాథపురం, రాణిపేట, సేలం, శివగంగ, తంజావూరు, తిరువణ్ణామలై, తిరువారూరు, విల్లుపురం జిల్లాల్లో 24 గ్రామపంచాయతీల్లో రూ.8.33 కోట్లతో నిర్మించిన 50 తరగతి గదులకు కూడా ఆయన ప్రారంభోత్సవం చేశారు.

పంచాయతీ యూనియన్ కార్యాలయాలు...

ఇదే విధంగా కోయంబత్తూరు, పుదుకోట, విరుదునగర్, రాణిపేట, తెన్‌కాశి, తిరువారూరు జిల్లాల్లో రూ.35.24 కోట్లతో నిర్మించిన 9 పంచాయతీ యూనియన్ కార్యాలయ భవనాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఇదే విధంగా పంచాయతీ యూనియన్లలో పనిచేసే ఉన్నతాధికారులకు 95 వాహనాలకు పచ్చజెండా ఊపి ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు ముత్తుసామి, పెరియసామి, కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, తంగం తెన్నరసు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, గృహవసతి నగరాభివృద్ధి శాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కాకర్ల ఉషా, రాష్ట్రగృహనిర్మాణ సంస్థ చైర్మన్ పూచ్చి ఎస్.మురుగన్, ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జీఎస్ సమీరన్, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ యూనియన్ల శాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గగన్‌దీప్ సింగ్ బేదీ తదితరులు పాల్గొన్నారు.

దిండివనం వద్ద పట్టాలపై పగుళ్లు


దిండివనం సమీపంలో ఆగిన రైలు,
పగిలిన పట్టాలకు మరమ్మతు చేస్తున్న రైల్వే సిబ్బంది

● పుదుచ్చేరి రైలుకు తప్పిన ముప్పు

చెన్నై, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దిండివనం సమీపంలో రైలు పట్టాలపై పగుళ్లు ఏర్పడ్డాయి. ఈ విషయాన్ని ఆ మార్గంలో వెళ్తున్న పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్ లోకో పైలట్ గుర్తించి, రైలు ఆపివేయడంతో ఘోర ప్రమాదం తప్పింది. ఎగ్మూరు రైల్వేస్టేషన్ నుంచి సోమవారం ఉదయం 6 గంటలకు పుదుచ్చేరి రైలు బయలుదేరింది. ఆ రైలు దిండివనం సమీపం ఓంకూర్ వద్ద వెళ్తుండగా రైలింజన్ చక్రాల కింద పెద్ద శబ్దం వినిపించింది. దీంతో లోకో పైలట్ బ్రేకులు వేసి రైలు నిలిపివేశారు. కిందకు దిగి పట్టాలను పరిశీలించగా ఓ చోట పగుళ్లు కనిపించాయి. వెంటనే ఆయన రైల్వే ఉన్నతాధికారులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. రైల్వే ఇంజనీర్లు, కార్మికులు హుటాహుటిన అక్కడికి వెళ్ళిన పట్టాలు పగిలిన చోట మరమ్మతులు చేపట్టారు. సుమారు గంట తర్వాత పట్టాల మరమ్మతులు పూర్తయ్యాయి. అప్పటివరకూ రైలులో ఉన్న ప్రయాణికులంతా తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గంట తర్వాత ఆ రైలు పుదుచ్చేరి వైపు బయలుదేరింది.

కోవైలో నాటు తుపాకీతో ముగ్గురి అరెస్ట్

ప్యారీస్, డిసెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల నగరం కోయంబత్తూర్‌లో నాటు తుపాకీతో సంచరించిన ఐటీ ఉద్యోగి సహా ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెలితే... కోవైకు చెందిన వ్యక్తులు బీహార్‌లో నాటు తుపాకులు కొనుగోలు చేసినట్లు కోవై తీవ్రవాద నిరోధక విభాగం పోలీసులకు తెలిసింది. దీంతో పోలీసులు కోవై ప్రాంతంలో నిఘా వేయగా బీలమేడు సమీపంలోని వినోబాజీనగర్‌లో నివసిస్తున్న కొంత మంది యువకులు బిహార్ నుండి నకిలీ తుపాకీలను కొనుగోలు చేసిన వ్యవహారం వెలుగు చూపింది. దీంతో సంబంధిత యువకుల ఇంట్లో సోమవారం ఆకస్మిక తనిఖీ చేసిన పోలీసులు ఓ ఇంట్లో తుపాకీ, 6 బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కోయంబత్తూర్‌లోని చేరన్ నగర్‌కు చెందిన మణికందన్(23), కాళపట్టికి చెందిన హరిష్(24), కుందన్ రాయ్(22) లను అరెస్ట్ చేశారు.


నాటు తుపాకీతో పట్టుబడిన యువకులు

తిరువణ్ణామలైలో రూ.25 కోట్ల విలువైన
నవపాషాణ మురుగన్ విగ్రహం స్వాధీనం

● ఇద్దరి అరెస్టు

టి.నగర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలైలో నవపాషాణాలతో తయారైన మురుగన్ విగ్రహాన్ని విక్రయించేందుకు ప్రయత్నించిన వెంకటేశన్, రాజశేఖర్ అనే ఇరువురిని కేంద్ర అటవీ నేరాల నిరోధక విభాగం పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి మురుగన్ విగ్రహంతోపాటు ఏనుగు దంతాలతో తయారైన శ్రీకృష్ణుడి విగ్రహాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. నవపాషాణ మురుగన్ విగ్రహం 10 కేజీల బరువును కలిగి ఉంది. ఆ విగ్రహం విలువ రూ.25 కోట్ల దాకా ఉండవచ్చునని భావిస్తున్నారు. ఇదే విధంగా ఏనుగు దంతంతో తయారై శ్రీకృష్ణుడి విగ్రహం విలువ రూ.35 లక్షలని అధికారులు ప్రకటించారు.


విగ్రహాల విక్రయానికి ప్రయత్నించిన ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు. (ఇన్‌సెట్‌లో) విగ్రహాలు

విద్యుత్ వెలుగులు
మొదలైన 'క్రిస్మస్' సందడి
ముంగిట నక్షత్రాలు

ప్యారీస్, డిసెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): నగరంలో క్రిస్మస్ సందడి నెలకొంది. గత వారం రోజులుగా వర్షం లేకపోవడంతో అలంకరణ సామగ్రిని కొనుగోళ్లతో బజారు వీధులు కిటకిటలాడుతున్నాయి. నగరంలోని షాపింగ్ మాల్స్‌ను భారీ కిస్మస్ ట్రీ, రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. అదేవిధంగా మంగళవారం అర్ధరాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు చర్చిలు కూడా ముస్తాబయ్యాయి. మరోవైపు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేస్తూ శాంటాక్లాజ్ వేషధారణలో చిన్నారులు వీధుల్లో సందడి చేస్తున్నారు. ఈ ఏడాది ఎనిమిదడుగుల ఎత్తు నుంచి అడుగు ఎత్తు వరకు శాంటాక్లాజ్ బొమ్మలు, బేకరీల్లో కేక్‌లు, అలాగే అలంకరణ సామగ్రి ప్యారీస్, డౌటన్, ఎగ్మోర్, మైలాపూర్, అడయార్, వేలచ్చేరీ, వడపళని, మడిపాకం, తాంబరం, కేకే నగర్, వాషర్‌మెన్‌పేట, తండయార్‌పేట, తిరువత్తియూర్, రాయపురం, అంబత్తూర్, ఆవడి, విల్లివాకం, పెరంబూర్, టీనగర్ తదితర ప్రాంతాల్లోని ప్రధాన మార్కెట్లలో అందుబాటులో ఉన్నాయి.


శాంథోం చర్చి ప్రాంగణంలో ఆకట్టుకుంటున్న క్రిస్మస్ ట్రీ

మళ్లీ నగరం వైపు
అల్పపీడనం
● మరో 5 రోజులు వర్షసూచన

చెన్నై, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో కేంద్రీకృతమై ఆంధ్రా కోస్తాతీరంవైపు మళ్ళిన బలమైన అల్పపీడనం తన దిశ మార్చుకుని చెన్నై వైపు కదలుతోందని వాతావరణ కేంద్రం అధికారులు ప్రకటించారు. ప్రస్తుతం అల్పపీడనం మధ్య, పడమటి, నైరుతి దిశగా కదులుతోందని, దాని ప్రభావంతో మరో ఐదు రోజులపాటు రాష్ట్రంలో చెదురుమదురుగా వర్షాలు కురిసే అవకాశాలున్నాయన్నారు. మంగళవారం ఉదయం ఆ అల్పపీడనం రాష్ట్రం వైపు కదలి, ఉత్తర తమిళనాడు, దక్షిణ ఆంధ్ర నడుమ తీరానికి చేరువగా, చెన్నై నగరానికి తూర్పు బంగాళాఖాతంలో బలహీనపడుతుందని తెలిపారు. దీని ప్రభావంతో మంగళ, బుధవారాల్లో విల్లుపురం, కడలూరు, చెంగల్పట్టు జిల్లాల్లో పుదుచ్చేరిలోని పలు ప్రాంతాల్లో భారీగా, ఓ మోస్తరుగా వర్షాలు కురుస్తాయని వివరించారు. నగరానికి సంబంధించినంతవరకు మంగళ, బుధవారాల్లో ఆకాశం మేఘావృతమై, ఉదయం వేళల్లో తేలికపాటి జల్లులు కురుస్తాయని, దట్టంగా మంచుకురిసే అవకాశం కూడా ఉందని తెలిపారు. దిశమారిన ఈ అల్పపీడనం కారణంగా చెన్నై, కడలూరు, నాగపట్టినం, ఎన్నూరు, కాట్టుపల్లి, పుదుచ్చేరి, కారైక్కాల్ ఓడరేవుల్లో మూడో నెంబర్ తుఫాను సూచికలను ఎగురవేసినట్లు తెలిపారు.

సమాచార ధ్వని

4న తపాలా ఏజెంట్ల ఇంటర్వ్యూలు

పెరంబూర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తపాలా జీవిత బీమా ఏజెంట్ల నియమాకం జనవరి 4వ తేది జరుగనుంది. 10వ తరగతి ఉత్తీర్ణులై 19 ఏళ్లకు పైబడిన వారు ఇంటర్వ్యూలో పాల్గొనవచ్చు. ఇతర సంస్థ ల బీమా ఏజెంట్లుగా పనిచేస్తున్న వారికి తపాలా బీమా ఏజెంట్లుగా అవకాశం కల్పించరు. ఆసక్తిగల వారు మూడు ఫొటోలు, విద్యార్హత, నివాస ధ్రువపత్రం తదితర ఒరిజినల్, రెండు సెట్ల జెరాక్స్ కాపీలతో అన్నాసాలైలోని ప్రధాన తపాలా కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు ఇంటర్వ్యూలకు హాజరుకావాలి. పాలసీలకు తగిన ప్రోత్సాహక వేతనం ఉంటుందని తపాలా శాఖ తెలియజేసింది.

'టాటా మోటర్స్' కార్ల కర్మాగారం

పెరంబూర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాణిపేట జిల్లా మనపాక్కం లో 470 ఎకరాల్లో రూ.9,000 కోట్ల పెట్టుబడులతో టాటా మోటర్స్ కార్ల కర్మాగారం ఏర్పాటుచేయనుంది. ఈ కర్మాగారానికి సెప్టెంబరులో ముఖ్యమంత్రి స్టాలిన్ శంకుస్థాపన చేయగా, తొలివిడతగా రూ.914 కోట్లతో నిర్మాణపనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో, పర్యావరణ శాఖ అనుమతులు కోరుతూ టాటా మోటార్స్ దరఖాస్తు చేసుకుంది. ఈ కర్మాగారంలో ఏడాదికి 2 లక్షల కార్లు తయారుచేయనుండగా, వాటిలో 'జాగ్వార్ ల్యాండ్ రోవర్' కార్లు అధికంగా తయారుకానున్నాయి. ఈ కర్మాగారం ద్వారా 5,000 మందికి ఉపాధి లభించనుందని అధికారులు తెలిపారు.

ఆదివారం టైంటేబుల్‌తో రేపు రిజర్వేషన్ కేంద్రాలు

ఐసిఎఫ్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్లలోని రిజర్వేషన్ కేంద్రాలు 25వ తేదీ ఆదివారం టైం టేబుల్‌తో పనిచేయనున్నాయి. బుధవారం క్రిస్మస్ (ఈ నెల 25వ తేది) ప్రభుత్వ సెలవు కావడంతో, ఆ రోజున ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మాత్రమే (ఆదివారం టైం టేబుల్) పనిచేస్తాయని దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. అలాగే, బుధవారం చెన్నై సెంట్రల్-అరక్కోణం, సెంట్రల్-సూళ్లూరుపేట, చెన్నై బీచ్-చెంగల్పట్టు మార్గంలో నడిచే సబర్బన్ రైళ్లు ఆదివారం టైం టేబుల్‌లో నడుస్తాయని అధికారులు తెలిపారు.

శివగంగలో 'సిప్కాట్' పారిశ్రామికవాడ

● పర్యావరణ అనుమతులకు వినతి

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లాలో రూ.342 కోట్లతో ఏర్పాటవుతున్న సిప్కాట్ పారిశ్రామికవాడకు పర్యావరణ అనుమతులు కోరుతూ సిప్కాట్ సంస్థ దరఖాస్తు చేసుకుంది. అరసనూరు గ్రామంలో 775 ఎకరాల్లో రూ.342 కోట్లతో ఈ పారిశ్రామికవాడ ఏర్పాటుకానుంది. ఇక్కడ ఆటోమొబైల్ విడిభాగాల తయారీ, జౌళి సహా పలు కర్మాగారాలు ఏర్పాటుకానుండగా, సుమారు 36,500 మందికి ఉపాధి లభిస్తుందని అధికారులు తెలిపారు.

తాంబరం-త్రివేండ్రం రైళ్ల పొడిగింపు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం తాంబరం-తిరువనంతపురం నార్త్ (కొచ్చువెలి) ఏసీ వారాంతపు రైలు సేవలు పొడిగించినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. నెం.06035 తాంబరం-తిరువనంతపురం నార్త్ ఏసీ వారాంతపు రైలు జనవరి 3,10,17,24,31 (శుక్రవారం) తేదీల్లో తాంబరం నుంచి రాత్రి 7.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 11.30 గంటలకు తిరువనంతపురం నార్త్ చేరుకుంటుంది. మరుమార్గంలో నెం. 06036 తిరువనంతపురం నార్త్-తాంబరం ఏసీ వారాంతపు రైలు జనవరి 5, 12, 18. 19,26, ఫిబ్రవరి 2 (ఆదివారం) తేదీల్లో తిరువనంతపురం నార్త్ నుంచి మధ్యాహ్నం 3.25 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 7.35 గంటలకు తాంబరం చేరుకుంటుంది.

27,28న వేతన ఒప్పందంపై చర్చలు

పెరంబూర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రవాణా శాఖ కార్మికుల వేతన ఒప్పందంపై ఈ నెల 27,28వ తేదీల్లో చర్చలు జరుగనున్నాయి. రవాణా శాఖలో పనిచేస్తున్న 1.08 లక్షల మంది కార్మికులకు 15వ వేతన ఒప్పందంపై అక్టోబరు 27వ తేది చర్చలు జరిగాయి. ఈ క్రమంలో, రెండో విడత చర్చలు ఈ నెల 27,28 తేదీల్లో క్రోంపేటలోని మెట్రోపాలిటన్ రవాణా సంస్థ శిక్షణా కేంద్రంలో రవాణా శాఖ మంత్రి శివశంకర్ నేతృత్వంలో జరుగుతాయని, ఈ చర్చల్లో పాల్గొనాలని సీఐటీయూ సహా అన్ని కార్మిక సంఘాలకు లేఖలు రాసినట్లు వేతన ఒప్పంద చర్చల కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది.

నేడు పెరియార్‌కు సీఎం స్టాలిన్ నివాళి

పెరంబూర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పెరియార్ 51వ వర్ధంతి సందర్భంగా డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆయనకు నివాళులర్పించనున్నారు. అన్నాసాలై (సింప్సన్ సమీపం)లోని పెరియార్ విగ్రహానికి మంగళవారం ఉదయం సీఎం స్టాలిన్ నివాళులర్పించనున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి దురైమురుగన్, కోశాధికారి టీఆర్ బాలు, పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు, రాష్ట్ర కమిటీ సభ్యులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొంటారని ఆ పార్టీ ఒక ప్రకటనలో తెలియజేసింది.

నత్తనడకన సాగుతున్న కోవై ఎయిర్‌పోర్ట్ విస్తరణ



టి.నగర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వాణిజ్యనగరం కోయంబత్తూరు విమానాశ్రయ విస్తరణ పనులకు సంబంధించి స్థల సేకరణ 95 శాతం మేర పూర్తయినప్పటికీ ఆ విమానాశ్రయ అభివృద్ధిపనులు నత్తనడక సాగుతుండటంతో స్థలాభావ సమస్యలు రోజురోజుకూ అధికమవుతున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కోయంబత్తూరు, దాని చుట్టూ ఉన్న ఏడు జిల్లాల ప్రజలు ఈ విమానాశ్రయం నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని 627 ఎకరాల్లో విస్తరణ పనులకు సంబంధించి ప్రత్యేక ప్రాజెక్టును 2010లో ప్రకటించారు. పదేళ్లుగా స్థలసేకరణ కొనసాగింది. రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే నిధుల కేటాయించి, 95 శాతం స్థల సేకరణను పూర్తిచేసి కేంద్ర విమానయాన సంస్థకు ఆ స్థలాలను అప్పగించింది. ఈ విమానాశ్రయంలో ప్రస్తుతం రోజూ 30కి పైగా విమానాలు నడుపుతున్నారు. 10 వేల మంది ప్రయాణికులు వచ్చి వెళుతున్నారు. మిగతా 5 శాతం స్థలాలను అప్పగించేలోగా ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అప్పగించిన స్థలాల్లో రన్‌వేల పొడవు పెంచటం, డీపార్చర్ ఏరియా తదితర నిర్మాణాలను చేపట్టాలని కేంద్ర విమానయాన సంస్థకు ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు. రోజూ వచ్చే ప్రయాణికులు, వారితోపాటు వచ్చే సందర్శకుల సంఖ్య పెరుగుతుండటంతో వాహనాల పార్కింగ్‌కు స్థలం కొరత ఏర్పడుతోంది. ఈ సమస్య కారణంగా ప్రయాణికులు సకాలంలో విమానాలను అందుకోలేకపోతున్నారు. వీలైనంత త్వరగా విస్తరణ పనులు ప్రారంభించాలని కోయంబత్తూరు, పరిసర జిల్లాలకు చెందిన విమాన ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

'సెట్' ద్వారా అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ

ఐసిఎఫ్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ 'సెట్' ద్వారా చేపట్టేందుకు రాష్ట్ర ఉన్న విద్యాశాఖ టీఆర్‌బీకి అనుమతిచ్చింది. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కె.గోపాల్ విడుదల చేసిన జీవోలో... ప్రభుత్వ కళాశాలల్లో యూజీసీ మార్గదర్శకాల ప్రకారం, 'సెట్' అర్హత పరీక్ష 2024-25 నుంచి 2026-27వ సంవత్సరం వరకు (మూడేళ్లు) నిర్వహించి అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయాలని నిర్ణయించారు. ఆ ప్రకారం, 2024 నుంచి మూడేళ్ల సెట్ నిర్వహణకు తిరునల్వేలి మనోన్మణియం సుందరనార్ విశ్వవిద్యాలయానికి ఉన్నత విద్యాశాఖ అనుమతులిచ్చింది. ఆ ప్రకారం, ఆ విశ్వవిద్యాలయం గత మార్చిలో నోటిఫికేషన్ విడుదల చేసి, ఆన్‌లైన్ ద్వారా ఏప్రిల్ 1 నుంచి 30వ తేది వరకు దరఖాస్తులు స్వీకరించింది. జూన్ 7,8 తేదీల్లో ఆన్‌లైన్ ద్వారా పరీక్ష నిర్వహణకు హాల్‌టిక్కెట్లు కూడా అందజేశారు. కానీ, సాంకేతిక కారణలతో ఈ పరీక్షలు నిర్వహించలేదు. ఆరు నెలలుగా ఈ పరీక్ష నిర్వహణపై ఎలాంటి ప్రకటన విడుదల కాని నేపథ్యంలో సెట్ పరీక్ష నిర్వహణ టీఆర్‌బీకి అప్పగించినట్లు ఉన్నత విద్యాశాఖ తెలిపింది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా ఎగ్మూర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని అధికారులు తెలిపారు. సైడన్‌హామ్స్ రోడ్డు కొంత భాగం, డిప్పో వీధి, పీటీ మొదాలి వీధి, సామి పిళ్లై వీధి కొంత భాగం, ఏపీ రోడ్డు, హంటర్స్ రోడ్డు, జనరల్ కాలిన్స్ రోడ్డు, మాడెక్స్ వీధి, వీవీ ఆలయ వీధి, కురవన్‌కుళం, సుబ్బయ్యనాయుడు వీధి, నెహ్రూ ఔట్‌డోర్ స్టేడియం, నెహ్రూ ఇండోర్ స్టేడియం, అప్పారావు గార్డన్, పెరియ తంబి వీధి, ఆండియప్పన్ వీధి, ఆనందకృష్ణన్ వీధి, పీకే ముదాలి వీధి, చూలై ప్రాంతం, కేపీ పార్క్ ప్రాంతం, పెరంబూర్ బారాక్స్ రోడ్డు, రోట్లర్ వీధి, కలపతియప్ప వీధి, విర్పురాముత్తయ్య వీధి, డాలి వీధి, మాణిక్యం వీధి, రంగయ్య వీధి కొంత భాగం, అష్టాభుజనం రోడ్డు కొంత భాగం, రాఘవ వీధి కొంత భాగం ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు తెలిపింది.

జయ పాలన మళ్లీ అందిస్తాం



మెర్సీ హోంలో వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న శశికళ

ఐసిఎఫ్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): డీఎంకే కబందహస్తాల నుంచి రాష్ట్ర ప్రజలను కాపాడాలనే లక్ష్యంతో ప్రతి అడుగు వేస్తున్నానని, రాష్ట్రంలో మళ్లీ జయలలిత పాలన అందిస్తామని శశికళ తెలిపారు. క్రిస్మస్ సందర్భంగా కీల్పాక్కం హాల్ రోడ్డులో ఉన్న మాత చర్చిలో శశికళ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మెర్సీ హోంలో వృద్ధులతో కలసి కేక్ కట్ చేసి సహాయాలు అందజేయడంతో పాటు వృద్ధులకు భోజనం వడ్డించారు. అనంతరం శశికళ మీడియాతో మాట్లాడుతూ... ఉద్యోగం చేస్తున్న మహిళలకు విడిది గృహాలు ఏర్పాటుచేసే పథకాన్ని 2013లో జయలలిత ప్రారంభించారన్నారు. ప్రస్తుతం డీఎంకే ఈ పథకాన్ని 'తోళి' అని పేరు మార్చి అమలుచేస్తుందన్నారు. పాఠశాల విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు సక్రమంగా అందించడం లేదని, జయలలిత హయాంలో అందజేసిన ల్యాప్‌టాప్, సైకిళ్ల పథకం ప్రస్తుతం అమలు కావడం లేదన్నారు. రాష్ట్రంలో అన్నాడీఎంకే ఓట్ల శాతం తగ్గలేదని, రాష్ట్రంలో మళ్లీ జయలలిత పాలన తీసుకురావాలన్నదే తన లక్ష్యమని శశికళ తెలిపారు.

ప్లాస్టిక్ సంచుల వినియోగం

● హోటళ్లకు రూ.15 కోట్ల జరిమానా

ప్యారీస్, డిసెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ బాక్సుల్లో, ప్లాస్టిక్ సంచుల్లో ఆహారాన్ని విక్రయిస్తున్న సుమారు 11వేల హోటళ్లకు రూ.15 కోట్ల జరిమాన విధించినట్లు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. తమిళనాడు ఫుడ్ సేఫ్టీ విభాగం ఆధ్వర్యంలో నగరంలోని ఫుడ్ వ్యాపారుల అవగాహనా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మంత్రి సుబ్రమణ్యం మాట్లాడుతూ.. కాలంతో పాటు పాత ఆహారపు అలవాట్లు మారిపోయాయని, యాంత్రిక జీవనంలో సమయం ఆదా చేయాలన్న ఉద్దేశంతో ప్రస్తుతం ఫాస్ట్‌ఫుడ్స్ తినే అలవాటు బాగా పెరుగుతోందన్నారు. ఈ క్రమంలో ఇలాంటి ఆహారం తినడం వల్ల అనారోగ్యం బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందన్నారు. అయినా ప్రజలు ఫాస్ట్‌ఫుడ్స్ తినడం ఆపడం లేదన్నారు. అదే అదనుగా తీసుకుంటున్న క్యాంటీన్లు, మెస్‌లు, రోడ్ సైడ్ రెస్టారెంట్లు ఆహార పదార్థాలను ప్లాస్టిక్ బాక్సుల్లో, సంచుల్లో వేసి విక్రయిస్తున్నారని తెలిపారు. దీనిపై గత సంవత్సరం హోటళ్ల యాజమానులకు అవగాహన కల్పించడంతో పాటు ఆహార నాణ్యత శిక్షణా తరగతులు నిర్వహించి రాష్ట్రవ్యాప్తంగా 78,763 హోటళ్లకు ఆహార భద్రతా శాఖ అనుమతులిచ్చిందన్నారు. ఇందుకు విరుద్ధంగా నడుస్తున్న హోటళ్లకు రూ.15కోట్ల మేరకు జరిమానా విధించినట్లు మంత్రి వివరించారు.

పాఠశాల మూసివేయొద్దు....!

● నిర్వాహకుల కాళ్లపై పడి వేడుకున్న ఎమ్మెల్యే

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సేలం పాత సూరమంగళంలో రామలింగ వళ్లలార్ ఎయిడెడ్ మహోన్నత పాఠశాల మూసివేస్తున్నారంటూ వార్తలు వెలువడ్డాయి. దీంతో దిగ్భ్రాంతి చెందిన తల్లిదండ్రులు పాఠశాలను ముట్టడించి, పాఠశాల మూసివేయరాదంటూ ఆందోళన చేపట్టారు. ఆ సమయంలో అక్కడకు చేరుకున్న సేలం వెస్ట్ ఎమ్మెల్యే అరుళ్, పాఠశాల నిర్వాహకుల కాళ్లపై పడి, పాఠశాల మూసివేయరాదని వేడుకున్నారు.. అనంతరం పాఠశాల మూసేది లేదని నిర్వాహకులు తెలపడంతో ఎమ్మెల్యే, తల్లిదండ్రులు అక్కడి నుంచి వెళ్లారు.




నిర్వాహకులను బతిమాలుతున్న ఎమ్మెల్యే అరుళ్

వర్క్ ఫ్రమ్ హోంను రాజకీయం చేస్తున్నారు

● హీరో విజయ్‌పై వాసుకి ధ్వజం

అడయార్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వర్క్ ఫ్రమ్ హోం విధానాన్ని టీవీకే అధ్యక్షుడు, సినీ హీరో విజయ్ రాజకీయం చేస్తున్నారంటూ సీపీఎం మహిళా నేతల్లో ఒకరైన కేంద్ర కమిటీ సభ్యురాలు పి.వాసుకి ఆరోపించారు. సీపీఎం మహానాడు కోయంబత్తూరు వేదికగా జరిగింది. ఇందులో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ మదురై జిల్లా మేలూరులో కేంద్ర ప్రభుత్వం అనుమతించిన టంగ్‌స్టన్ సొరంగం తవ్వకానికి వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయడం మంచి నిర్ణయమన్నారు. అనేక ప్రాంతాల్లో మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని దాడులు జరుగుతున్నాయన్నారు. వన్ నేషన్ - వన్ ఎలక్షన్ భారత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఫాసిస్టుకు, మాయాశక్తికి తేడా తెలియని టీవీకే అధ్యక్షుడు విజయ్.. ప్రభుత్వ ఏర్పాటుకు ప్రయత్నించకుండా ఏం చేస్తారోనన్న భయంగా ఉందన్నారు. ఒక కంపెనీకి వర్క్ ఫ్రమ్ హోం చేయొచ్చు.. కానీ, ఒక రాజకీయ పార్టీకి వర్క్ ఫ్రమ్ హోం చేయలేమన్నారు.

తిరువళ్లువర్ జీవిత చరిత్ర విశేషాలతో ఎగ్జిబిషన్



ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారిలో ఉన్న తిరువళ్లువర్ విగ్రహ సిల్వర్ జూబ్లీ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నిర్వహిస్తున్నారు. తంథై పెరియార్ ఈవేరా జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ సుబ్బులక్ష్మి పాల్గొని, తిరువళ్లువర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పుస్తక ఎగ్జిబిషన్, చిన్నారుల డ్రాయింగ్ ఎగ్జిబిషన్‌ను కలెక్టర్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కార్తికేయన్, కార్పొరేషన్ మేయర్ సుజాత, మండల కమిటీ అధ్యక్షుడు వెంకటేశన్, జిల్లా గ్రంథాలయ అధికారి పళని సహా పలువురు అధికారులు, పురప్రముఖులు పాల్గొన్నారు.

'ఊటీ'లో రమణీయ దృశ్యాలు



పెరంబూర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాలో ప్రముఖ పర్యాటక ప్రాంతమైన ఊటీలో ప్రకృతి రమణీయ దృశ్యాలు సంతరించుకున్నాయి.. శీతాకాలం ప్రారంభమైన నేపథ్యంలో, ఊటీ, కున్నూరు, కోతగిరి తదితర ప్రాంతాల్లో తెల్లవారుజాము నుంచే దట్టమైన మంచు కురుస్తోంది. బొటానికల్ గార్డెన్ సహా పలు ప్రాంతాల్లో చెట్లు మంచు నీటి బిందువులతో దర్శనమిస్తున్నాయి. సూర్యోదయం వేళ మొక్కలు, చెట్లపై ఉన్న నీటి బిందువులు ఆవిరి అవుతూ పర్యాటకులను ఆహ్లాదపరుస్తోంది. సోమవారం ఉదయం ఊటీలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 6 డిగ్రీలు నమోదయ్యాయి.

బాలికపై అత్యాచార యత్నం

● యువకుడికి దేహశుద్ధి

వాషర్‌పేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారానికి యత్నించిన యువకుడికి ప్రజలు దేహశుద్ధి చేశారు. దిండుగల్ జిల్లాకు చెందిన 17 ఏళ్ల బాలిక, తండ్రి, సోదరులతో కలసి ఉంటోంది. శనివారం రాత్రి బాలిక ఇంటి నుంచి బయటకు వచ్చిన సమయంలో, మాలైమేడుపుదూర్ ప్రాంతానికి చెందిన మనోజ్ (30) బాలిక నోరు మూసి, చేతులు కట్టి అత్యాచారానికి యత్నించాడు. అంతలో ఇంటి నుంచి బయటకు వచ్చిన తండ్రి అది చూసి దిగ్భ్రాంతి చెందాడు. అంతలో తప్పించుకోనేందుకు యత్నించిన మనోజ్‌ను చుట్టుపక్కల వారి సాయంతో బాలిక తండ్రి పట్టుకొని దేహశుద్ధి చేసి, సానార్‌పట్టి పోలీసులకు అప్పగించారు. కాగా, మనోజ్‌పై కిడ్నాప్, హత్య తదితర కేసులున్నట్లు పోలీసుల విచారణలో తెలిసింది.

స్పా సెంటర్‌లో వ్యభిచారం

● నిర్వాహకుడి అరెస్ట్

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్‌లోని స్పా సెంటర్‌లో వ్యభిచారం సాగిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. తేనాంపేట పోలీసులకు అందిన సమాచారంతో శనివారం టి.నగర్ డా.బీఎన్ రోడ్డు లో ఉన్న స్పా సెంటర్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టగా, ఆ సెంటర్‌లో వ్యభిచారం జరుగుతున్నట్లు గుర్తించారు. ఈ వ్యవహారంలో రాయపేట ఇరుసప్పన్ వీధికి చెందిన జాకీర్ హుస్సేన్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు, 11 మంది ఉత్తరాది మహిళలను ప్రభుత్వ హోంకు తరలించారు.

'స్వచ్ఛ భారత్'కు రూ.125 కోట్లు కేటాయింపు

పెరంబూర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): 'స్వచ్ఛ భారత్' కార్యక్రమాన్ని గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టేలా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలివిడతగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ వాటాగా రూ.125 కోట్లు కేటాయించాయి. గ్రామీణ ప్రాంతాలను శుభ్రంగా ఉంచే లక్ష్యంతో తొలివిడతగా 2014 నుంచి 2019 వరకు స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టారు. రెండో విడతగా 2020-21లో ప్రారంభమై ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కూడా కొనసాగుతోంది. ఈ కార్యక్రమాన్ని ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రూ.240 కోట్లతో చేపట్టాలని నిర్ణయించగా, కేంద్ర ప్రభుత్వం తొలివిడతగా అక్టోబరులో రూ.75 కోట్లు కేటాయించిన నేపథ్యంలో, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.50 కోట్లు కేటాయిస్తూ గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి గగన్‌దీప్‌సింగ్ బేదీ జీవో విడుదల చేశారు.

పారిపోయిన ఖైదీ

● ఐదుగురి సస్పెన్షన్

ఐసిఎఫ్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూర్ జిల్లా జైలు నుండి ఖైదీ తప్పించుకున్న వ్యవహారంలో జైలు అసిస్టెంట్ ఆఫీసర్ సహా ఐదుగురిపై సస్పెన్షన్ వేటుపడింది. దోపిడీ కేసులో అరెస్టయిన కోవిల్‌పట్టికి చెందిన సూర్య శనివారం జైలు నుంచి పరారయ్యాడు. ఈ వ్యవహారంలో జైలు అసిస్టెంట్ ఆఫీసర్లు గంగారాజన్, సీత, కానిస్టేబుళ్లు రాజపాండి, శక్తివేల్, రవికుమార్ తదితరులను సస్పెండ్ చేస్తూ జైళ్ల శాఖ ఉత్తర్వులు జారీచేసింది.

డీఎంకే పాలనలో అభివృద్ధి శూన్యం

● కేంద్రమంత్రి మురుగన్

ఐసిఎఫ్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): డీఎంకే పాలనలో రాష్ట్రాభివృద్ధి శూన్యమని కేంద్ర సహాయ మంత్రి ఎల్. మురుగన్ తెలిపారు. జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో జరిగిన కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన కేంద్ర మంత్రి మురుగన్ వద్ద, తమిళనాడులో 7వ సారి కూడా డీఎంకే అధికారం చేపడుతుందని ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారని మీడియా ప్రశ్నించారు. దానికి కేంద్ర మంత్రి మురుగన్ స్పందిస్తూ... స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధిలో విఫలమైందన్నారు. డీఎంకే కూటమి త్వరలోనే విచ్ఛిన్నమవుతోందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

విశ్వకర్మ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



వేలూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విశ్వకర్మ స్నేహితుల సంక్షేమ సంఘం ప్రత్యేక జనరల్ బాడీ సమావేశం సోమవారం జరిగింది. ఆర్కాడు రోడ్డులోని హోటల్‌లో జరిగిన సమావేశానికి సంఘ అధ్యక్షుడు తేజోమూర్తి అధ్యక్షత వహించారు. సంఘ సెక్రటరీ జనార్దనన్ ఆహ్వానం పలికారు. సమావేశంలో భాగంగా 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను సీనందల్ మఠం 65వ పీఠాధిపతి విశ్వకర్మ జగద్గురు గురుశివరాజ్ జ్ఞానాచార్య గురుస్వామి ఆవిష్కరించారు. సమావేశంలో కేంద్ర ప్రభుత్వ రీసెర్చి కేంద్రం మాజీ డైరెక్టర్ డా.మీనాక్షి సుందరం, మఠాలంయ గురుపూజ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసన్, వీఐటీ యూనివర్సిటీ లెక్చరర్ తూండిల్‌కరవ్వురాజ్ సహా పలువురు పాల్గొన్నారు.

రూ.3,657 కోట్లతో 70 మెట్రోరైళ్లు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): చెన్నై మెట్రో రైల్ రెండో విడత ప్రాజెక్ట్‌లో డ్రైవర్‌రహిత మెట్రో రైళ్లు నడుపనున్నారు. ఇందుకోసం రూ.3,656 కోట్లతో 70 డ్రైవర్ రహిత మెట్రోరైళ్ల తయారీకి 'బీఈఎంఎల్' సంస్థతో చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్‌ఎల్) ఒప్పందం చేసుకుంది.

29 నుంచి తూత్తుకుడి, కుమరి జిల్లాల్లో సీఎం స్టాలిన్ పర్యటన

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 29,30,31 తేదీల్లో తూత్తుకుడి, కన్నియాకుమారి జిల్లాల్లో ముఖ్యమంత్రి స్టాలిన్ క్షేత్రస్థాయిలో పర్యటించ నున్నారు. సీఎం స్టాలిన్ ప్రతినెలా జిల్లాల్లో క్షేత్రస్థాయి పర్యటన చేసి, ప్రభుత్వ పథకాల అమలు, లబ్ధిదారులకు సంక్షేమ సహాయాల అందజేత, పార్టీ అభివృద్ధిపై నేతలతో చర్చిస్తున్నారు. ఆ ప్రకారం, ఈ నెల 29,30,31 తేదీల్లో తూత్తుకుడి, కన్నియాకుమారి జిల్లాల్లో ముఖ్యమంత్రి పర్యటించనున్నారు. ఈ పర్యటనలో కన్నియాకుమారిలో వివేకానంద రాక్-తిరువళ్లువర్ విగ్రహం మధ్య రూ.37 కోట్లతో నిర్మించిన అద్దాల వంతెనను ముఖ్యమంత్రి ప్రజల అందుబాటులోకి తీసుకురానున్నారని సచివాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

ద్విచక్రవాహనాలకు నిప్పు పెట్టిన వ్యక్తి అరెస్ట్

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీబీ సత్రంలో ఐదు ద్విచక్రవాహనాలకు నిప్పు పెట్టిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. వినోద్ అనే వ్యక్తి ఇంటి మేడపై ఉన్న ఇంటిని నటరాజన్ రూ.6 లక్షల లీజుకు తీసుకొని ఉంటున్నాడు. కొద్దిరోజులుగా నటరాజన్ ప్రతిరోజు సమస్యలు సృష్టిస్తున్నట్లు తెలిసింది. దీంతో, ఇళ్లు ఖాళీ చేయాలని వినోద్ పలుమార్లు అతడికి చెప్పినా ఫలితం లేకపోవడంతో, ఇరువురి మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. శనివారం కూడా ఇద్దరి మధ్య వాగ్వివాదం నెలకొంది. ఈ క్రమంలో, అర్ధరాత్రి సమయంలో ఇంటి ముందుంచిన ఐదు ద్విచక్రవాహనాలు మంటల్లో చిక్కుకోవడం గమనించిన వినోద్, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు, ద్విచక్రవాహనాలకు నిప్పు పెట్టిన నటరాజన్‌ను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

26న జిల్లా విద్యాధికారి పదోన్నతుల కౌన్సెలింగ్

పెరంబూర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ అధికారి పదోన్నతులకు సంబంధించిన కౌన్సెలింగ్ ఈ నెల 26వ తేది 'ఎమిస్' వెబ్‌సైట్ ద్వారా నిర్వహిస్తున్నట్లు పాఠశాల విద్యాశాఖ ప్రకటనలో తెలిపింది. రాష్ట్రంలో 50 శాతానికి పైగా ఉన్న జిల్లా విద్యాశాఖ అధికారి పోస్టులు పదోన్నతుల ద్వారా చేపట్టనున్నామని, అందుకు అర్హత కలిగిన 329 మిడిల్ స్కూలు ప్రధానోపాధ్యాయుల జాబితా తయారుచేసి, ప్రాధాన్యత ప్రాతిపదికన జూన్ 14వ తేది కౌన్సెలింగ్ నిర్వహించి 170 మందికి జిల్లా విద్యాశాఖ అధికారులుగా పదోన్నతి కల్పించారు. ఈ క్రమంలో, ఖాళీగా ఉన్న పోస్టులకు ఈ నెల 26వ తేది ఉదయం 10 నుంచి ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నామని, జాబితాలో 171 నుంచి 329 వరకు ఉన్న ప్రధానోపాధ్యాయులు కౌన్సిలింగ్‌లో పాల్గొనవచ్చని అధికారులు తెలిపారు.

ఇంట్లోకి దూసుకెళ్లిన కారు



పెరంబూర్, డిసెంబరు 23 (ఆంధ్ర జ్యోతి): ఈరోడ్ జిల్లాలో కారు ఇంట్లోకి దూసుకెళ్లిన ఘటనలో అదృష్టవశాత్తు ప్రాణనష్టం జరగలేదు. సెంగోతంపాళయానికి చెందిన రేవతి, ఇద్దరు కుమారులతో శనివారం రాత్రి ఇంట్లో నిద్రిస్తోంది. అర్ధరాత్రి 12.10 గంటల సమయంలో హఠాత్తుగా పెద్ద శబ్దం విన్న రేవతి, ఇంటి నుంచి బయటకు వచ్చి చూడగా, రేకులతో ఉన్న వరండాలో కారు దూసుకురావడం గమనించి దిగ్భ్రాంతి చెందింది. చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకొని కారులో చిక్కుకున్న డ్రైవర్‌ను అద్దాలు పగులగొట్టి బయటకు తీసారు.. కారు డ్రైవర్ ఈరోడ్ శక్తి నగర్‌కు చెందిన వరుణ్ అని, మద్యం మత్తులో కారు నడపడంతో ఈ ప్రమాదం జరిగిందని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. కాగా, కారు దూసుకెళ్లడంతో ధ్వంసమైన ద్విచక్రవాహనం, వరండా తదితరాల మరమ్మతులను తాను నగదు ఇస్తానని వరుణ్ చెప్పడంతో, బాధితుల విజ్ఞప్తి మేరకు పోలీసులు కేసు నమోదుచేయలేదని సమాచారం.

ఆదాయంలో చెన్నై సెంట్రల్ మూడో స్థానం

పెరంబూర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో 2023-24వ ఆర్థిక సంవత్సరంలో అధిక ఆదాయం పొందిన రైల్వేస్టేషన్లలో డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్ మూడో స్థానంలో నిలిచింది. సమాచార హక్కు చట్టం ద్వారా అడిగిన ప్రశ్నకు రైల్వే శాఖ ఈ వివరాలు తెలియజేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రైల్వే శాఖ సరుకులు, ప్రయాణికుల ద్వారా రూ.2.56 లక్షల కోట్లు ఆదాయం ఆర్జించింది. వాటిలో రూ.3,337 కోట్ల 66 లక్షల 47 వేలతో న్యూ ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో ప్రథమ స్థానం, రూ.1,692 కోట్ల 31 లక్షల 43 వేలతో హౌరా రైల్వేస్టేషన్ రెండవ స్థానంలో నిలిచింది. ఇక, చెన్నై సెంట్రల్ రూ.1,299 కోట్ల 31 లక్షల 43 వేలతో మూడో స్థానంలో నిలిచింది.. అలాగే, అధిక ఆదాయం ఆర్జించిన 100 రైల్వేస్టేషన్లలో దక్షిణ రైల్వే పరిధిలోని చెన్నై ఎగ్మూర్ 16వ స్థానం, కోవై 34, తిరువనంతపురం 45, తాంబరం 54, ఎర్నాకుళం 55, మదురై 61, కోలికోడ్ 70, తిరుచ్చి 78, త్రిశూర్ 79, కాట్పాడి 86, తిరునల్వేలి 92, సేలం 98, కన్నూర్ 100వ స్థానంలో నిలిచాయి.

రక్తదాన శిబిరానికి స్పందన



వేలూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాట్పాడి లయన్స్ సంఘం, వేలూరు రక్తదాన కేంద్రం, సేవకన్ సంక్షేమ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో చిత్తూరు బస్టాండ్ సమీపంలోని నారాయణి కల్యాణ మండపంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లయన్స్ సంఘం అధ్యక్షుడు యువరాజ్ అధ్యక్షత వహించి, మొదటి వ్యక్తిగా రక్తదానం చేశారు. తొలుత సెక్రటరీ గజేంద్రన్ ప్రసంగించారు. కార్యక్రమంలో అన్నాడీఎంకే జిల్లా సెక్రటరీ ఎస్కార్కే అప్పు, ఇండియన్ రెడ్‌క్రాస్ సంఘం కాట్పాడి శాఖ అవై అధ్యక్షుడు జనార్ధనన్, ఉదవుమ్ ఉల్లంగళ్ సంఘం సెక్రటరీ రామచంద్రన్, సేవకన్ ట్రస్ట్ డైరెక్టర్ రాధాకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే వేడుకల్లో రాష్ట్ర శకటానికి అనుమతి నిరాకరణా?

● వివరణ ఇచ్చిన సర్కారు

అడయార్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జనవరి 26వ తేదీ జరిగే గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని ఢిల్లీలో నిర్వహించే ప్యారేడ్‌లో రాష్ట్రానికి చెందిన శకటానికి అనుమతి నిరాకరించినట్టు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి కె.పళనిస్వామి వెల్లడించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం వివరణ ఇచ్చింది. రిపబ్లిక్ డే వేడుకల సందర్భంగా నిర్వహించే శకటాల ప్రదర్శనలో రాష్ట్రానికి చెందిన శకటానికి అనుమతి రాలేదనే చర్చ రాష్ట్ర వ్యాప్తంగా సాగుతోంది. ఇందులో ఏమాత్రం నిజం లేదు. 2025లో జరిగే శకటాల ప్రదర్శనలో రాష్ట్ర ప్రభుత్వం పాలుపంచుకోలేదు. ఈ ప్రదర్శనలో 15 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల శకటాలను మాత్రమే అనుమతించారు. దీనికి కారణంగా రొటేషన్ విధానమే. ప్రతి యేటా జరిగే శకటాల ప్రదర్శనలో అన్ని రాష్ట్రాలకు చెందిన శకటాలకు అవకాశం ఇవ్వరు.. 2024లో జరిగిన గణతంత్ర వేడుకల్లో రాష్ట్రానికి చెందిన శకటం భాగస్వామ్యమైంది. రొటేషన్ విధానం కారణంగా 2025లో ఆ అవకాశం లేదు. 2026లో జరిగే శకటాల ప్రదర్శనలో రాష్ట్ర శకట ప్రదర్శన ఉంటుంది. కానీ, బాధ్యతాయుతమైన ఒక రాజకీయ పార్టీ నేత, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి రాష్ట్ర ప్రజలను తప్పుదారి పట్టించేలా అసత్య ప్రచారం చేయడం ఏమాత్రం భావ్యం కాదు. ఈ అసత్య ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దని ప్రభుత్వం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

ఉద్యోగుల ఆస్తులు వ్యక్తిగతమైనవి కావు: హైకోర్టు

ప్యారీస్, డిసెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల ఆస్తులు, రుణ సంబంధిత వివరాలను వ్యక్తిగతమైనవిగా భావించరాదని మద్రాస్ హైకోర్ట్ తేల్చిచెప్పింది. కృష్ణగిరి జిల్లా నీటి వనరుల శాఖా అసిస్టెంట్ ఇంజినీర్‌గా పని చేసిన కాళియప్పన్‌కు సంబంధించిన ఆస్తులు, రుణాలు తదితర వివరాలు కోరుతూ తిమ్మాపురానికి చెందిన శ్రీనివాసన్ సమాచార చట్టం కింద దరఖాస్తు చేశారు. అయితే ఈ వివరాలను తెలియజేసేందుకు సమాచార హక్కు కార్యాలయ అధికారులు నిరాకరించడంతో శ్రీనివాసన్ మద్రాస్ హైకోర్టులో కేసు వేశారు. సోమవారం ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి సీవీ కార్తికేయన్ ప్రభుత్వ ఉద్యోగుల ఆస్తులు వ్యక్తిగతమైన వివరాలుగా భావించరాదని ఉత్తర్వులు జారీ చేశారు.

మార్చిలో మిష్కిన్ 'పిశాసు-2' విడుదల



మిష్కిన్ దర్శకత్వంలో రూపొందుతున్న 'పిశాసు-2' చిత్రాన్ని వచ్చే యేడాది మార్చి లో విడుదల చేయాలని మేకర్స్ నిర్ణయించారు. చాలా ఏళ్లుగా ఈ సినిమా చిత్రీకరణలో ఉంది. నిర్మాతల్లో మనస్పర్థలు, ఆర్థిక సమస్యల కారణంగా సినిమా నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం నెలకొంది. ఈ నేపథ్యంలో ఈ చిత్రంలో ప్రధాన పాత్ర పోషించిన హీరోయిన్ ఆండ్రియా జెర్మయ్య పుట్టిన రోజును పురస్కరించుకుని ఆమెకు బర్త్‌డే విషెస్ చెబుతూ నిర్మాతలు ఓ పోస్టర్ రిలీజ్ చేశారు. ఇందులో వచ్చే యేడాది మార్చిలో విడుదల చేయనున్నట్టు పేర్కొన్నారు. ఆండ్రియా జెర్మయ్య, పూర్ణ, రాజ్‌కుమార్ పిచ్చుమణి తదితరులు నటించిన ఈ చిత్రంలో గౌరవ పాత్రలో అగ్రహీరో విజయ్ సేతుపతి నటించారు. కార్తీక్ రాజా సంగీత స్వరాలు సమకూర్చిన ఈ సినిమా చిత్రీకరణ కొడైకెనాల్, దిండుగల్ తదితర ప్రాంతాల్లో జరుపుకుంది. దీంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. కాగా, మొదటి భాగం సూపర్‌హిట్ అయిన విషయం తెల్సిందే.

ఇకపై యేడాదికి రెండు చిత్రాలు

● హీరో సూర్య



తన అభిమానులకు హీరో సూర్య ఒక హామీ ఇచ్చారు. ఇకపై యేడాదికి రెండు చిత్రాల్లో నటిస్తానని మాట ఇచ్చారు. ఇటీవల హీరో సూర్య - చిరుత్తై శివ కాంబినేషన్ లో వచ్చిన 'కంగువా' సినిమా బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌ను మూటగట్టుకుంది. దీంతో హీరోతో పాటు అయన అభిమానులు తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు. ఇదిలావుంటే, సూర్య ఇపుడు రెండు చిత్రాల్లో నటిస్తున్నారు. 'సూర్య-45' షూటింగ్ విరామ సమయంలో అయన అభిమానులను కలుసుకుని వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కోయంబత్తూరులో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారుగా 300 మంది వరకు అభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అభిమానులతో సూర్య మాట్లాడుతూ, 'ఇక నుంచి ప్రతి యేడాదికి రెండు సినిమాలను రిలీజ్ చేసేలా ప్లాన్ చేశాను. తప్పకుండా రెండు సినిమాలను విడుదల చేస్తాను' అని హామీ ఇచ్చారు. ఇదిలావుంటే, వచ్చే యేడాది సూర్య నటించిన 'సూర్య-44', 'సూర్య-45' చిత్రాలు ప్రేక్షకుల ముందుకురానున్నాయి. ఈ రెండు చిత్రాలకు ఇంకా టైటిల్స్ ఖరారు చేయలేదు. కాగా, 'సూర్య-44' చిత్ర టైటిల్ టీజర్‌ను రిలీజ్ చేసే సమయంలోనే వెల్లడించాలని మేకర్స్ బావిస్తున్నారు.

చిత్రజ్యోతి

సత్యరాజ్ - చేరన్ ప్రత్యేక పాత్రల్లో 'బయోస్కోప్'



'బయోస్కోప్' ఫస్ట్‌లుక్

సంగగిరి రాజ్‌కుమార్ దర్శకత్వంలో సీనియర్ నటుడు సత్యరాజ్, దర్శక నటుడు చేరన్ ప్రత్యేక పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'బయోస్కోప్'. సినిమాపై ఎలాంటి అవగాహనలేని పల్లెటూరి ప్రజలు ఎలా సినిమా తీశారన్న వాస్తగ సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. వచ్చే నెలలో 3న విడుదల చేయనున్నారు. ఈ సినిమా టీజర్‌ను నటులు ఆర్య, శశికుమార్ రిలీజ్ చేశారు. 'వెంగాయం' చిత్రంతో విమర్శకుల ప్రశంసలు అందుకున్న దర్శకుడు రాజ్‌కుమార్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని 25 డాట్స్ క్రియేషన్స్ పతాకంపై చంద్ర సూర్యన్, ప్రభు సుబ్రహ్మణి, పెరియస్వామి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా గురించి దర్శకుడు రాజ్‌కుమార్ మాట్లాడుతూ, 'గ్రామంలో పుట్టిపెరిగిన నేను 'వెంగాయం' చిత్రాన్ని ఎన్నో వ్యయప్రయాసల కోర్చి తెరకెక్కించాను. నా తొలి సినిమా నిర్మాణంలో ఎదురైన అనుభవాలతో 'బయోస్కోప్' రూపొందించాం. సినిమాపై ఏమాత్రం అవగాహనలేని పల్లెటూరి ప్రజలు ఒక సినిమా ఎలా తీశారన్న కథకు కామెడీని టచ్ చేస్తూ తీశామని పేర్కొన్నారు.



సిజా రోజ్

రీఎంట్రీ ఇస్తున్న సిజా రోజ్

2016లో విజయ్ సేతుపతి ప్రధాన పాత్ర పోషించిన 'రెక్క' సినిమా ద్వారా కోలీవుడ్‌కు పరిచయమైన యువ నటి సిజా రోజ్. ఆ తర్వాత 'భైరవ' సినిమాలో కీర్తి సురేష్ అక్కగా నటించగా, నాలుగేళ్ళ తర్వాత 'ఉడన్‌పిరప్పే' సినిమాలో హీరో శశికుమార్ భార్యగా నటించారు. 2016 నుంచి 2024 వరకు కేవలం మూడు చిత్రాల్లో మాత్రమే నటించిన ఈ అమ్మడికి సినీ అవకాశాలు లేకపోవడంతో ఇండస్ట్రీకి దూరమైంది. ఈ నేపథ్యంలో శరత్ కుమార్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'ది స్మైల్ మేన్' సినిమా ద్వారా మళ్ళీ కోలీవుడ్‌లోకి రీ ఎంట్రీ ఇస్తోంది. ఇందులో యువ నిఘా అధికారిణిగా నటించింది.. తన రీఎంట్రీపై ఆమె స్పందిస్తూ, 'రెక్క' చిత్రం తర్వాత అదే బాణీలోనే సినిమా అవకాశాలు రావడంతో వాటిని రిజెక్ట్ చేశాను. అందుకే ఐదారేళ్ళుగా తమిళ వెండితెరకు దూరంగా ఉన్నాను. ఈ సినిమాలో నేను పోషించిన పాత్ర కొత్తగా ఉండటంతో నటించేందుకు అంగీకరించాను' అని వివరించారు.

క్రిస్మస్ సందడి..

మార్కెట్‌లో స్టార్లు, కేకులు సిద్ధం



శాంటాక్లాజ్ వేషధారణలో చిన్నారుల సందడి - అమ్మకాలకు స్టార్లు, క్రిస్మస్ ట్రీలు



పశువుల పాక నమూనా

క్రిస్మస్ అంటేనే తళుక్కుమనే నక్షత్రాల వెలుగులు... నోరూరించే కేకులు, ఆకట్టుకుంటున్న భారీ క్రిస్మస్ ట్రీలు... ఏసు ప్రభు జన్మస్థలాన్ని గుర్తుచేసే పశువుల పాక నమూనాలు... పండుగ సందర్భంగా ఎటు చూసినా దర్శనమిస్తున్నాయి. క్రైస్తవులు క్రీస్తు జన్మదినాన్ని ఉత్సాహంగా జరుపుకొనేందుకు ఇల్లు, చర్చ్ ప్రాంగణాలను అందంగా తీర్చిదిద్దుతున్నారు. పండుగకు ఒక రోజు సమయం ఉండటంతో, రాజధాని నగరంలో క్రిస్మస్ అమ్మకాలు ఊపందుకున్నాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో క్రిస్మస్ ట్రీ, నక్షత్రాల విక్రయాలు జోరందుకున్నాయి.

- ప్యారీస్, ఆంధ్రజ్యోతి

డాక్టర్ కాసలకు 'విశిష్ట సాహితీ పురస్కారం'

● 'సత్కవితా చతురానన' బిరుదు కూడా



డాక్టర్ కాసల నాగభూషణంకు పురస్కారం ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

చెన్నై, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కవి పండితుడు, అనువాదకుడిగా, గ్రంథరచయితగా, సాహితీ సమీక్షకుడిగా మాతృభాషారాధన చేస్తూ, శారదామాతకు పద్య, గద్య నైవేద్యం సమర్పిస్తున్న వాక్భూషణులు డాక్టర్ కాసల నాగభూషణంకు బాపట్ల జిల్లా అద్దంకిలోని పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మ చారిటబుల్ ట్రస్టు 'విశిష్ట సాహితీ పురస్కారం' అందజేసింది. అంతేగాక ఆయన చేస్తున్న సాహితీ సేవకు గుర్తుగా 'సత్కవితా చతురానన' బిరుదుతో సత్కరించింది. ఆదివారం ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి అధ్యక్షతన అద్దంకిలో జరిగిన కార్యక్రమంలో ఈ సత్కారం జరిగింది. కార్యక్రమంలో భాగంగా కాసల రచనల్లో 'ఆముక్తమాల్యద వచనానువాదం' గురించి డీవీఎం సత్యనారాయణ, 'తిక్కన సీత' గురించి ఇలపావులూరి శ్రీధర శర్మ, 'నవీన సుమతి శతకం' గురించి వారణాసి రఘురామశర్మ పరిచయ ప్రసంగాలు చేశారు. శతావధాని నారాయణం బాలసుబ్రహ్మణ్యం, గాడేపల్లి దివాకర దత్తు తదితరులు కాసలను అభినందించి, సత్కరించారు.

డైరీలపై తగ్గిన మోజు

● మందకొడిగా విక్రయాలు



పెరంబూర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సమీపిస్తున్న తరుణంలో, షోరూమ్‌లో వివిధ రకాల డైరీలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి. కొత్త డైరీలు కనిష్టంగా రూ.80 నుంచి గరిష్టంగా రూ.650-900 వరకు అందుబాటులో ఉన్నాయి. ఈ విషయమై స్టేషనరీ దుకాణం యజమానులు మాట్లాడుతూ, ప్రస్తుతం ఈ-మెయిల్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ తదితరాల్లో తమ వివరాలు నమోదు చేసుకుంటున్నారని, కొందరు తమ మొబైల్ ఫోన్ 'నోట్'లో సమాచారాన్ని అప్‌లోడ్ చేస్తున్నారని, అందువల్ల డైరీల విక్రయాలు మందగించాయన్నారు. గతంలో తమకు సంబంధించిన ముఖ్యమైన రోజులు, దైనందిన జీవితం, సెల్‌ఫోన్ నెంబర్లు తదితరాలు రాసుకొనేందుకు ప్రజలు డైరీలను అధికంగా వాడేవారని, నూతన సంవత్సరం రోజున బంధువులు, అధికారులకు గిఫ్ట్‌గా డైరీలు ఇచ్చేవారన్నారు. ప్రస్తుతం టెక్నాలజీ పెరిగిన కారణంగా డైరీల విక్రయాలు తగ్గాయన్నారు. నూతన సంవత్సరానికి వారం రోజుల నుంచి పొంగల్ వరకు మాత్రమే డైరీల విక్రయాలుంటాయని, అనంతరం డైరీలు భద్రపరచాల్సి వస్తుందని వారు పేర్కొన్నారు.

శ్రవణానంద భరితం... సంగీత తరంగం

● ఆకట్టుకుంటున్న 'మద్రాసనా ఫెస్టివల్'



సంగీత కచేరీ నిర్వహిస్తున్న లాల్గుడి కృష్ణన్, లాల్గుడి విజయలక్ష్మి బృందం

టి.నగర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మార్గళి మాసం వచ్చిందంటే చాలు నగరంలోని మ్యూజిక్ అకాడమీ, నారదగాన సభ, కృష్ణగాన సభ, పార్థసారథి సభలు కర్ణాటక, తమిళ సంప్రదాయ సంగీత కార్యక్రమాలను నిర్వహించి నగరవాసులకు శ్రవణానందం కలిగిస్తాయి. దేశంలోని ఏ సంగీత కళాకారుడైనా సరే నగరంలో జరిగే మార్గళి సంగీతోత్సవంలో తన ప్రతిభాపాటవాలను ప్రదర్శిస్తేనే ఆక్స్‌ఫర్డ్ వర్సిటీ డిగ్రీ సర్టిఫికెట్ పొందినంత గుర్తింపు లభిస్తుంది. అందుకే నగరంలో జరిగే మార్గళి సంగీతోత్సవంలో అరగంటసేపైనా తమకు అవకాశం కల్పించమంటూ ప్రముఖ సంగీత సభల నిర్వాహకులకు వర్ధమాన సంగీత కళాకారులు విజ్ఞప్తి చేస్తుంటారు. అయితే మూడేళ్లకు పైగా మార్గళి సంగీతోత్సవాల్లో పాల్గొనే కళాకారుల పేర్లన్నీ ఖరారవుతుండటంతో కొత్త కళాకారులకు ప్రముఖ సంగీత సభల్లో పాల్గొనే అవకాశం కోసం వేచి ఉండాల్సి వస్తోంది. వీటన్నింటికి తోడు ప్రస్తుతం కర్ణాటక సంగీత ప్రియులకు గాత్రవిద్వాంసులు, సంగీత వాయిద్య పరికరాలతో స్వరాలతో శ్రవణానందభరితం చేస్తున్నారు. ఆ కోవలోనే తరమణిలోని ఎంఎస్ సుబ్బులక్ష్మి అరంగంలో ఆదివారం రాత్రి నిర్వహించిన మద్రాసనా ఫెస్టివల్ తొలిరోజు సంగీత ప్రదర్శన ప్రత్యేకమైన ధ్వని, స్వరాలను అందించి సంగీత ప్రియులను మైమరపించింది. ప్రతియేటా ఈ మద్రాసనా ఫెస్టివల్ ట్రస్టు కర్ణాటక సంగీత కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ యేడాది ఆదివారం ప్రారంభమైన ఈ సంగీత కార్యక్రమాలు ఈ నెల 26 వరకు కొనసాగనున్నాయి. రాష్ట్రానికి చెందిన పదిమంది మేటి సంగీత కళాకారులు పాల్గొననున్నారు. ఈ సంగీత కార్యక్రమాల్లో సంగీత కళాకారులు మైకులు ఉపయోగించకుండా వైలన్, తంబూరా, మృదంగం వంటి వాయిద్య పరికరాల ధ్వనులను అందించి శ్రోతలకు వింత అనుభూతిని కల్పించారు. ఈ మద్రాసనా ఫెస్టివల్ ప్రారంభోత్సవ సందర్భంగా తొలిరోజు లాల్గుడి కృష్ణన్, లాల్గుడి విజయలక్ష్మి బృందం సంగీత కచేరి, అభిషేక్‌రామ్ బృందం సంగీత కచేరి నిర్వహించారు. మంగళవారం సాయంత్రం సాకేతరామన్, సందీప్‌నారాయణన్ సంగీత కచేరీలు నిర్వహించనున్నరని సంస్థ నిర్వాహకుడు మహేష్ వెంకటేశ్వరన్ తెలిపారు. తమ సంస్థ నిర్వహిస్తున్న ఈ కచేరీల్లో వాయిద్య పరికరాల శబ్దాన్ని పెంచేలా మైకులు ఉపయోగించకుండా వాటి స్వరాలను ఉన్నదున్నట్లుగా అందిస్తున్నామని తెలిపారు. ఈ కొత్తదనాన్ని నగరంలోని కర్ణాటక సంగీత ప్రియులు హర్షధ్వానాలతో స్వాగతిస్తున్నారన్నారు.

4న 'మయోపియా'పై సదస్సు

● డాక్టర్ అశ్విన్ అగర్వాల్



మీడియా సమావేశంలో సదస్సు లోగో ఆవిష్కరిస్తున్న డాక్టర్ అశ్విన్ అగర్వాల్, డాక్టర్ సౌందరి

చెన్నై, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రోజూ మొబైల్ ఫోన్లు వాడటం, టీవీలు ఎక్కువగా చూడటం, కంప్యూటర్ల ముందు గంటల తరబడి పనిచేయడం తదితర కారణాల వల్ల వచ్చే కంటి జబ్బు 'మయోపియా'పై జనవరి 4న ప్రత్యేక సదస్సు నిర్వహించనున్నట్లు అగర్వాల్ ఐ హాస్పిటల్ చీఫ్ క్లినికల్ ఆఫీసర్ డాక్టర్ అశ్విన్ అగర్వాల్ తెలిపారు. సోమవారం ఉదయం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధిచెందటం ఓ వైపు మానవాళికి మేలు చేస్తున్నా, మరో వైపు హాని కూడా చేస్తోందని, దీనికి చక్కటి ఉదాహరణ మొబైల్ ఫోన్ల వాడకమేనన్నారు. యేడాది వయసు చిన్నారులకు తల్లిదండ్రులు ఆటలాడే వస్తువులు ఇవ్వటానికి బదులుగా మొబైల్‌ఫోన్లు ఇచ్చి వారి కంటి జబ్బులకు కారణమవుతున్నారని చెప్పారు. మొబైల్‌ఫోన్లు, టీవీ దగ్గరగా చూడటం వల్ల దగ్గరి చూపు పెరిగి, దూరపు చూపు తగ్గి అంధత్వానికి చేరువవుతున్నారని, దేశ జనాభాలో 21 శాతం మంది ఈ కంటి వ్యాధితో బాధపడుతున్నారని, 2030కల్లా వీరి సంఖ్య 30 శాతానికి పెరుగుతుందని తెలిపారు. ఈ కంటి వ్యాధి నిరోధానికి ఐదుగురు వైద్యనిపుణులు సదస్సులో ఆన్‌లైన్ ద్వారా వ్యాధిగ్రస్థులు, వారి తల్లిదండ్రులకు సలహాలు ఇస్తారని అశ్విన్ వెల్లడించారు. ఆ ఆస్పత్రి క్లినికల్ సర్వీసెస్ రీజినల్ హెడ్ డాక్టర్ ఎస్. సౌందరి మాట్లాడుతూ.. ఈ సదస్సు జనవరి 4 మధ్యాహ్నం మూడు గంటలకు చెన్నై, ముంబాయి నగరాల్లో ఒకేసారి ప్రారంభమవుతుందని, ఆన్‌లైన్‌లో రోగులకు సందేహాలకు వైద్యనిపుణులు సమాధానాలు చెబుతారని, అంతే కాకుండా నగరంలోని అగర్వాల్ కంటి ఆస్పత్రి శాఖల వద్ద మయోపియాకు సంబంధించి ఉచిత వైద్య పరీక్షలు కూడా జరుగుతాయన్నారు. ఈ సదస్సులో పాల్గొనదలచిన వారు రూ.99లను రిజిస్ట్రేషన్ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుందని, వివరాలను 95949 01868 అనే నెంబర్‌కు ఫోన్‌చేసి తెలుసుకోవచ్చునని చెప్పారు. మీడియా సమావేశంలో డాక్టర్ కళాదేవీ సతీష్, డాక్టర్ రమ్యా సంపత్, డాక్టర్ కళాదేవి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై సింహపు తోక కోతుల సంచారం



పెరంబూర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ జిల్లా వాల్పారై అటవీ ప్రాంతాల్లోని రోడ్లపై సింహపు తోకల సంచారం అధికంగా ఉందని, వాహనచోదకులు జాగ్రత్తగా వాహనాలు నడపాలని అటవీ శాఖ అధికారులు సూచిస్తున్నారు. అన్నైమలై పులుల శరణాలయం పర్యవేక్షణలో వాల్పారై, మానాంపల్లి తదితర అటవీ రేంజ్‌లు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో సింహపు తోక కోతులు అధికంగా జీవిస్తున్నాయి. చాలా పిరికితనం ఉండే ఈ కోతులు అడవిలో లభించే పండ్లు మాత్రమే తింటాయి. ఈ క్రమంలో, ఇటీవల కాలంలో ఈ కోతులు రోడ్డు దాటి మరో అటవీ ప్రాంతానికి వెళ్లడం అధికమైంది. రోడ్లపై సింహపు తోక కోతులు వెళ్లే సమయంలో పర్యాటకులు, వాహన చోదకులు అప్రమత్తంగా ఉండాలని, అలాగే, ఈ కోతులు జనావాస ప్రాంతాల్లోకి వస్తే, ఆ ప్రాంత ప్రజలు వీటికి ఆహారం ఇవ్వరాదని, అలాంటి చర్యలకు పాల్పడితే ఈ కోతులు జనావాస ప్రాంతాల్లోకి ప్రవేశించడం అలవాటుగా మారుతుందని అధికారులు సూచిస్తున్నారు.

ప్రొఫెసర్ అరుణన్ సహా ఆరుగురికి కలైంజర్ పురస్కారాలు



ఎస్.శ్రీరామ్, ప్రొఫెసర్ అరుణన్

చెన్నై, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఈ నెల 27 ప్రారంభం కానున్న పుస్తక ప్రదర్శన సందర్భంగా ప్రొఫెసర్ అరుణన్ సహా ఆరుగురికి 'కలైంజర్ పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. తమిళ సాహిత్య రచన, రంగస్థలం, కవితలు, అనువాదం ఇలా వివిధ విభాగాల్లో ఆరుగురిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రొఫెసర్ అరుణన్ (సాహిత్యం), కలైరాణి (రంగస్థలం), ఎస్.శ్రీరామ్ (కథానికలు), నెల్లై జయంతన్ (కవితలు), సురేష్‌కుమార్ ఇంద్రజిత్ (నవల), నిర్మాల్య (అనువాదం)ను ఈ అవార్డులకు ఎంపిక చేశామన్నారు. పుస్తక ప్రదర్శన సందర్భంగా ఏర్పాటయ్యే ప్రత్యేక కార్యక్రమంలో వీరికి అవార్డులను ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.



కుట్రాలంలో పర్యాటకుల సందడి

పెరంబూర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప భక్తులు, సెలవు రోజు కావడంతో వచ్చిన పర్యాటకులతో కుట్రాలం జలపాతం సందడిగా మారింది. తెన్‌కాశి జిల్లాలో ఈ నెల 12 నుంచి కురిసిన భారీవర్షాల కారణంగా కుట్రాలం ప్రధాన జలపాతం సహా ఐదు జలపాతాల్లో వరదలు ఏర్పడడంతో పర్యాటకుల స్నానాలకు నిషేధం విధించారు. ఈ నేపథ్యంలో, వరద ఉధృతి తగ్గడంతో రెండు రోజుల నుంచి పర్యాటకులు జలపాతాల వద్ద స్నానాలు చేసేందుకు అనుమతించారు. ఆదివారం కుటుంబాలతో వచ్చిన పర్యాటకులు జలపాతాల వద్ద స్నానాలు చేస్తూ, సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. అలాగే, శబరిమల సీజన్ కావడంతో అయ్యప్ప భక్తులు సైతం పెద్దసంఖ్యలో జలపాతాల వద్ద కనిపించారు.

శ్రీవారిసేవలో న్యాయమూర్తులు




మంత్రి పార్థసారథి - జస్టిస్ భవాని సుబ్బరాయన్



తిరుమల శ్రీవారి ఆలయం ముందు జస్టిస్ కృష్ణకుమార్ - జస్టిస్ అనిల్‌వర్మ - జస్టిస్ సంతోష్

తిరుమల, డిసెంబరు23(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో..మణిపూర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కృష్ణకుమార్, మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భవాని సుబ్బరాయన్, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనిల్‌వర్మ, బాంబే హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంతోష్, ఎంపీ గురుమూర్తి ఉన్నారు. వీరికి రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. రాష్ట్ర మంత్రి పార్థసారథి కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

హుండీ ద్వారా రూ.4.12 కోట్లు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 27 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 7 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచివున్నారు.

శనివారం నాటి హుండీ ఆదాయం : రూ.4.12 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 77,260

తలనీలాలు సమర్పించినవారు : 24,223



ఎగ్జైట్‌మెంట్‌చ్చే ఎక్జోటిక్ పార్క్!





పంచరంగుల చిలుకమ్మలు మీ భుజాలమీద వాలుతాయి. చేతి మీద నిలబడి కబుర్లు చెబుతాయి. కొండచిలువలను మెడ చుట్టూ వేసుకుని సెల్ఫీ దిగచ్చు. ఊసరవెల్లులు, విచిత్రమైన అతి పెద్ద తొండలతో ఆడుకోవచ్చు. ఎడారి ఒంటె మీద ఎక్కి చక్కర్లు కొట్టచ్చు. రంగురంగుల చేపలు ఈదులాడే ఆక్వేరియంను వీక్షించవచ్చు. తిరుపతిలో ఇటీవలే ప్రారంభించిన 'ఏటూజెడ్ ఎక్జోటిక్ పార్క్'లో ఈ వింత విశేషాలు అందుబాటులోకి వచ్చాయి. మంగళం రోడ్డులో ఆశా కన్వెన్షన్ సెంటర్ పక్కనే ఈపార్క్ ఉంది. చిట్టిపొట్టి విచిత్ర మేకలు.. గుర్రాలు.. గినీ పిగ్స్.. అరుదైన టర్కీ కోళ్లు, అడవి కోళ్లు, కుందేళ్లు, ఉడుములు, ముంగిసలు.. ఇలా ఎన్నోరకాల ఫ్రెండ్లీ పెట్స్‌తో సందర్శకులు సన్నిహితంగా ఉండచ్చు. పెట్స్ పెంపకంలో దాదాపు ఇరవై ఏళ్ల అనుభవం ఉన్న హర్షవర్ధన్ ఒకటిన్నర ఎకరాల స్థలంలో అరుదైన పక్షి, జంతుజాతులతో ఈ మినీ జూపార్క్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇక్కడ ప్రవేశ రుసుము 100 రూపాయలు.

పెట్స్‌పై ఆవగాహన కోసం

ప్రకృతికి దగ్గరగా ఉన్న అనుభూతిని కలిగించేందుకు ఈ పార్క్ ఏర్పాటు చేశాం. విద్యార్థులకు పక్షి, జంతుజాతుల గురించి తెలుసుకోవడానికి ఉపయోగపడుతుంది. ఇక్కడ ఉన్న కొన్ని పక్షులను కొనుగోలు చేశాం. ఎక్కువగా దత్తత వచ్చినవే ఉన్నాయి. ఒంటెను నెల్లూరు దగ్గర కాపాడి తీసుకొచ్చాం. ఎవరైనా పెంచుకోవాలని అనుకుంటే బ్రీడ్ అయిన జాతులను ఉచితంగా ఇవ్వాలనుకుంటున్నాం. జనవరి నుంచి దత్తత ఇవ్వడం ప్రారంభిస్తాం.

- హర్షవర్ధన్, ఎక్జోటిక్ పార్క్ నిర్వాహకుడు

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

పచ్చమలై అడవుల్లో 126 రకాల సీతాకోకచిలుకలు



ప్యారీస్, డిసెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి డివిజన్ అటవీ సంరక్షణాధికారి పెరియార్‌స్వామి ఆదేశాల మేరకు ఫారెస్ట్ అధికారి శరవణన్ ఆధ్వర్యంలో తిరుచ్చి జిల్లా తరియూర్ సమీపంలోని పచ్చమలై కొండల్లో సీతాకోక చిలుకల గణన చేపట్టారు. జిల్లా అటవీశాఖతో పాటు కోయంబత్తూరు, సేలం, చెన్నైకి చెందిన 'ది నేచర్ అండ్ బటర్‌ఫ్లై సొసైటీ' (టీఎన్‌బీఎస్) సభ్యులు ఈ లెక్కింపు పనుల్లో పాల్గొన్నారు. చెంగల్‌పట్టు ఎక్స్‌టెన్షన్ ఫారెస్ట్, కాళీయమ్మన్ కోవిల్ టేట్ రిజర్వు ఫారెస్ట్, ఎకో పార్క్ మంగళం అరువి సహా పచ్చమలైలోని అడవుల్లో ఈ గణన చేపట్టారు. సుమారు రెండు రోజుల పాటు జరిగిన గణనలో బ్లూజే, ఎల్లోజే, గ్లాస్ వార్బ్లర్, వండరింగ్ బ్లాక్, ఆరెంజ్ వార్బ్లర్, గ్రేమినో, బ్లాక్ అండ్ వైట్ వార్బ్లర్, డబుల్ టైల్డ్, నైట్ వార్బ్లర్ వంటి వివిధ రంగుల సీతాకోక చిలుకలను గమనించారు. అదే విధంగా ఈ గణన సందర్భంగా 126 రకాల సీతాకోకచిలుకలు ఆ ప్రాంతాల్లో సంచరిస్తున్న గుర్తించారు.

తిరువణ్ణామలైలో ముగిసిన జ్యోతి దర్శనం

ప్యారీస్, డిసెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): పంచభూత లింగాల్లో అగ్ని లింగ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన తిరువణ్ణామలైలో 11 రోజుల కార్తీక జ్యోతి దర్శనం సోమవారం ప్రత్యేక పూజలతో విజయవంతంగా ముగిసింది. ఉన్నామలై అమ్మవారి సమేత అరుణాచలేశ్వరుడు కొలువైన తిరువణ్ణామలై ఆలయంలో ఈ నెల 4వ తేదీ ధ్వజారోహణంతో 11 రోజుల కార్తీక దీపోత్సవం ప్రారంభమైంది. ఈ ఉత్సవాల్లో ప్రధానాంశంగా ఈ నెల 13వ తేదీ తెల్లవారుజామున 4.30 గంటలకు ఆలయ ప్రాంగణంలో శివాచార్యులు భరణి దీపం వెలిగించగా, సాయంత్రం 6 గంటలకు ఆలయం వెనుక వైపున్న అరుణాచలేశ్వర కొండ శిఖరంపై ఏర్పాటు చేసిన భారీ కొప్పెరలో వెలిగించిన మహాదీపం 11రోజుల పాటు నిర్విరామంగా వెలుగులు విరజిమ్మింది. ఈ జ్యోతిని తిరువణ్ణామలై నుంచి 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాంతాల భక్తులు కూడా ప్రతి రోజు దర్శించుకున్నారు. జ్యోతి దర్శనం ముగిసిన నేపథ్యంలో కొండపై నుంచి కొప్పెరను ఆలయ సిబ్బంది కిందకు తరలించారు. కొప్పెరకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అందులో అంజనాన్ని ఓ పాత్రలో నింపి భద్రపరచారు. ఈ అంజనాన్ని ఆరుద్ర దర్శనం రోజున నటరాజ స్వామి వారికి సమర్పించి ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు ప్రసాదంగా ఇస్తారు.

తిరుమలేశుని సేవలో భండారకేరి మఠాధిపతి



తిరుమల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉడిపిలోని భండారకేరి మఠాధిపతి విద్యేశతీర్థ స్వామి సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో శిష్యబృందంతో ఆలయం మహాద్వారం వద్దకు చేరుకున్న స్వామిజీకి టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఆలయ అర్చక బృందం స్వాగతం పలికారు.

చేపల వేటలో విషాదం
అన్నదమ్ముల సహా ముగ్గురి మృతి

● మృతదేహాల కోసం గాలింపు



లోకేష్, విక్రమ్, సూర్య (ఫైల్‌ఫొటోలు)

అడయార్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా మరక్కాణంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. బకింగ్ హామ్ కాలువలో చేపల వేటకు వెళ్లిన అన్నదమ్ములతో పాటు ముగ్గురు యువకులు నీట మునిగి మరణించారు. ఒక మృతదేహాన్ని వెలికితీయగా, మరో రెండు మృతదేహాల కోసం గాలిస్తున్నారు. ఈ వివరాలను పరిశీలిస్తే, జిల్లాలోని మరక్కాణం సంతతోపు ప్రాంతానికి చెందిన లోకేష్ (24), విక్రమ్ (23), సూర్య (23) అనే యువకులు మరికొంత మందితో కలిసి ఆదివారం చేపల వేటకు వెళ్లారు. అయితే, ఈ జిల్లాలో గత కొన్ని రోజులుగా విస్తారంగా వర్షాలు కురవడంతో జిల్లాలోని అన్ని కాలువల్లో నీరు పూర్తి స్థాయిలో పారుతుంది. బకింగ్‌హామ్ కాలువలో కూడా నీటి ప్రవాహం అధికంగా ఉంది. ఈ క్రమం లో ఈ ముగ్గురు చేపలు పడుతుండగా, లోకేష్ కాలుజారి నీటిలోపడిపోయాడు. అతడ్ని రక్షించే నిమిత్తం సూర్య, విక్రమ్ ప్రయత్నించి, వారు కూడా నీటి ప్రవాహంలో కొట్టుకుపోయారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసుల స్థానికులతో పాటు జాలర్లతో కలిసి మృతదేహాల కోసం గాలించగా లోకేష్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరి మృతదేహాల కోసం గాలిస్తున్నారు.

ప్రాస్టోడోంటిక్స్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగా ప్రొఫెసర్ వి.ఆనంద్‌కుమార్



చెన్నై, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పోరూరులోని శ్రీరామచంద్ర దంతవైద్య కళాశాల ఆస్పత్రిలో పనిచేస్తున్న ప్రొఫెసర్ వి.ఆనంద్‌కుమార్ ప్రోస్టోడోంటిక్స్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. దంతవైద్య అధ్యయన విభాగాల్లో కృతిమ దంతాల అమరిక, దెబ్బతిన్న, వంకర దంతాలను సరిచేయడం వంటి చికిత్సలందించే ప్రత్యేక విభాగాన్నే ప్రోస్టోడోంటిక్స్ అని పిలుస్తారు. ఇటీవల విజయవాడలో జరిగిన జాతీయ సదస్సులో ఆ సొసైటీ అధ్యక్షుడిగా ఆయన ఎన్నికయ్యారు. ఇప్పటివరకు ఆయన ఆ సొసైటీ ఉపాధ్యక్షుడిగా, సొసైటీ వెలువరించే సంచికకు ప్రధాన సంపాదకుడిగా పనిచేశారు. ప్రస్తుతం ఆ సొసైటీ తమిళనాడు పుదుచ్చేరి శాఖకు అధ్యక్షుడిగా సేవలందిస్తున్నారు.

ఘనంగా 'గ్రాండ్ క్రిస్మస్' సంబరాలు



సంఘ సేవకురాలు మధురవాణికి జ్ఞాపిక అందజేస్తున్న డాక్టర్ ప్రకాశ్‌రాజ్ - దయానా దంపతులు

ప్యారీస్, డిసెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా అత్తిపట్టు భగత్‌సింగ్ నగర్‌లోని కల్వరి బాప్టిస్ట్ ప్రేయర్ గార్డెన్‌లో ఆసియా బాప్టిస్ట్ కౌన్సిల్, మెర్సీ అండ్ ట్రూత్ ఉమెన్స్ ఫెలోషిప్ ట్రస్ట్ సంయుక్త అధ్వర్యంలో గ్రాండ్ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమ నిర్వాహకులు, అంతర్జాతీయ టీవీ ప్రసంగీకులు రెవ. డా.ఎస్.ప్రకాశ్‌రాజ్, దయానా రోస్ దంపతులు ఇటీవల తుఫాను, వరదల కారణంగా నష్టపోయిన 500 మందికి పైగా పాస్టర్లు, దైవసేవకులు, మహిళలకు, దివ్యాంగులకు నూతన వస్త్రాలు, నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక, సామాజిక రంగాలలో విశిష్ట సేవలందిస్తున్న ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరంకు చెందిన సీసీఎఫ్‌సీ కో ఫౌండర్ మధురవాణి పల్లాపాటి, తెలంగాణ బెరక్కా మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు రెవ. పి.యేసు పాదం, ఆర్చి బిషప్, డిక్టర్ దినతూదురాజా, ప్రముఖ సువార్త గాయకుడు టోనీప్రకాశ్ తదితర ప్రముఖులకు జ్ఞాపికలు అందించి సత్కరించారు. వేడుకల ఏర్పాట్లను షారోన్ ప్రకాశ్‌రాజ్ పర్యవేక్షించారు.

రేలా హాస్పిటల్‌లో క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ప్రొఫెసర్ మహమ్మద్ రేలా, డిప్యూటీ మేయర్ జి.కామరాజ్, ఏఎల్‌టీ స్కూలు దివ్యాంగ విద్యార్థులు

చెన్నై, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక క్రోంపేటలోని రేలా హాస్పిటల్‌లో సోమవారం ఉదయం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలలో భాగంగా అక్కడి ఏఎల్‌టీ స్కూలు చెందిన దివ్యాంగ చిన్నారులు, బాలబాలికలు శాంటాక్లాజ్ వేషధారణలతో ఆస్పత్రి ప్రాంగణంలో 'జింగిల్ బెల్స్ జింగిల్ బెల్స్ ఆల్‌దివే' 'మెర్రీ క్రిస్మస్' అంటూ.. చిన్న చిన్న గంటలు మోగిస్తూ అడుగుపెట్టారు. 2 నుండి 14 యేళ్లలోపు చిన్నారులంతా శాంటాక్లాజ్ వేషాలతో ఆస్పత్రిలో ప్రవేశించారు. వీరిని ఆసుపత్రి ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ మహమ్మద్ రేలా, తాంబరం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ జి.కామరాజ్ తదితరులు ఆహ్వానించారు. వీరితోపాటు ఆసుపత్రి ఉద్యోగులు, సిబ్బంది కూడా స్వాగతం పలికారు.

కాఫీ ధరలు పెరగడంతో రైతుల హర్షం



వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కూడలూరులో దిగుబడి తగ్గిన కారణంగా, కాఫీ ధరలు పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నీలగిరి జిల్లా కూడలూరు, పందలూరు ప్రాంతాల్లో తేయాకు తర్వాత రైతులు కాఫీ సాగుచేస్తుంటారు. ఈ ప్రాంతంలో 10,700 ఎకరాల్లో రోబస్టో కాఫీ, 5,750 ఎకరాల్లో అరబికా కాఫీ సాగుచేస్తున్నారు. ప్రతి ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో కాఫీ చెటు పూతకు వచ్చి, నవంబరు, జనవరి నెలల్లో కాఫీ పండ్ల కోతకు వస్తాయి ఈ ఏడాది కాఫీ పండ్లు కోసే సమయంలో వర్షాలు కురిసి దిగుబడి తగ్గడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. ఈ క్రమంలో, కాఫీ పండ్లు కిలో రూ.70, డ్రై కాఫీ కిలో రూ.220-రూ.230, క్లీన్డ్ కాఫీ గింజలు రూ.400 ధర పలుకుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్ మాట్లాడితే సస్పెన్షన్

● హెచ్చరించిన రవాణాశాఖ

పెరంబూర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విధుల్లో వున్న సమయంలో ప్రభుత్వ బస్సు డ్రైవర్లు సెల్‌ఫోన్ మాట్లాడితే 15 రోజులు సస్పెండ్ చేస్తామని రవాణాశాఖ హెచ్చరించింది. ప్రభుత్వ బస్సు డ్రైవర్లు సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసే దృశ్యాలు సోషల్ మీడియాలో వెలువడి వైరల్ అయ్యాయి. అదే సమయంలో ప్రయాణికులకు భద్రత కల్పించాలని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే డ్రైవర్లపై చర్యలు చేపట్టాలని సమాజ శ్రేయోభిలాషులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ క్రమంలో, ప్రభుత్వ బస్సు డ్రైవర్లు విధుల్లో సెల్‌ఫోన్ వినియోగిస్తే 15 రోజులు సస్పెండ్ చేస్తామని రవాణశాఖ ఇప్పటికే ఉత్తర్వులు జారీచేసింది. తాజాగా, డ్రైవరు బస్సు నడుపుతూ సెల్‌ఫోన్ మాట్లాడుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న నేపథ్యంలో, ఈ ఉత్తర్వులు తప్పక అమలుచేయాలని మండల అధికారులకు రవాణా శాఖ ఉత్తర్వులు జారీచేసింది.

పేరు మార్చుకున్న మదురై జిగర్‌తాండ



వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే కాకుండా, దేశవ్యాప్తంగా ఐకానిక్‌గా గుర్తింపు పొందిన మదురై జిగర్‌తాండ పేరు మార్చుకుంది. రీబ్రాండ్ పేరుతో ఫ్యాక్టరీ పేరును జిగ్నేచర్‌గా మారింది. ఈ పేరును మాస్టర్ చెఫ్ ఇండియా ఫైనలిస్ట్ అరుణ విజయ్ ఆవిష్కరించారు. స్థానిక బీసెంట్ నగర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో అరుణ్ విజయ్‌తో పాటు సీఈవో, ఫౌండర్ మహమ్మద్ ఫాజిల్, చీఫ్ ఆపరేషనల్ ఆఫీసర్ సంతోష్ కుమార్, చీఫ్ గ్రోత్ ఆఫీసర్ మొహ్మద్ రహ్మతుల్లా, ఫ్రాంఛైజీ డైరెక్టర్ వసంతన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహమ్మద్ ఫాజిల్ మాట్లాడుతూ, 'పేరు మార్పు కంటే గొప్ప ఎక్కువన్నారు. తమిళనాడు గొప్ప వారసత్వాన్ని కొత్త శిఖరాలరు తీసుకెళ్లడం తమ లక్ష్యమన్నారు. తమ సిబ్బంది అంకితభావంతో చేస్తున్న కృషి వల్లే మా కస్టమర్లు తమ విజయాన్ని మూలస్తంభాలుగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 23 (ఆంధ్ర జ్యోతి): పట్టాభిరాంలో ఉన్న ధర్మమూర్తి రావు బహదూర్ కలవల కన్నన్ చెట్టి హిందూ కాలేజీ అధ్వర్యంలో సోమవారం మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా భారీ ర్యాలీ జరిగింది. కాలేజీకి చెందిన ఎన్.ఎస్.ఎస్, ఎన్‌సీసీ, వైఆర్సీ విభాగాల సహకారంతో నిర్వహించిన ఈ ర్యాలీలో కాలేజీ బోధనా, బోధనేతర సిబ్బందితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ ర్యాలీని కళాశాల సంచాలకులు డాక్టర్ ఎస్.రాజేంద్ర నాయుడుతో కలిసి ప్రధానాచార్యులు డాక్టర్ జి.కల్వెక్కరసి ప్రారంభించి, డ్రగ్స్ నియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను వారు వివరించారు.



అన్నాఅరివాలయంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను కలిసి ఈ నెల 28న జరిగే డీఎండీకే వ్యవస్థాపకుడు విజయకాంత్ ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి ఆహ్వానిస్తున్న ఆ పార్టీ నేతలు ఎల్కే సుదీష్, పార్థసారథి, విజయకాంత్ తనయుడు విజయ ప్రభాకరన్



పాఠశాల విద్యాశాఖ తరపున ఐదు రోజుల సింగపూర్ పర్యటనకు వెళ్లే 42 మంది విద్యార్థులకు చెన్నై, కొట్టూరుపురం అన్నా సెంటినరీ లైబ్రరీ వద్ద జరిగిన కార్యక్రమంలో శుభాకాంక్షలు తెలియజేస్తున్న విద్యా శాఖ మంత్రి అన్బిల్ మహేష్



అళగప్పా విశ్వవిద్యాలయంలో జరిగే తమిళ గ్రంథాలయ ప్రారంభోత్సవంలో పాల్గొనాలని ముఖ్యమంత్రి స్టాలిన్‌ను ఆహ్వానిస్తున్న కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం, ఆయన తనయుడు, ఎంపీ కార్తీ చిదంబరం